టిటిడిలో ఆన్‌లైన్‌లో వాచీల ఈ- వేలం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన ఉపయోగించిన, పాక్షికంగా దెబ్బతిన్న 62 లాట్ల వాచీలు జూన్ 2 నుండి 3వ తేదీ వరకు టిటిడిలో ఆన్‌లైన్ ద్వారా ఈ - వేలం వేయనున్నారు. వీటిలో టైటాన్, సిటిజెన్, సొనాటా, రాగ, టైమ్స్ వన్, టైమ్స్, టైమెక్స్ తదితర స్మార్ట్ వాచీలు ఈఏఐడి నెం. 25106, 25107, 25108, 25109 ద్వారా ఈ - వేలం వేయనున్నారు. ఆసక్తి కలిగిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ - కొనుగోలు పోర్టల్‌లో రిజిస్టర్ అయిన బిడ్డర్లు వాచీల వేలంలో పాల్గొనటానికి అర్హులు. ఇతర వివరాలకు స్థానిక హరేకృష్ణ మార్గంలోని టిటిడి జనరల్ మేనేజర్, ఏఈవో, వెబ్‌సైట్ ద్వారా ఫోన్ నెంబర్ 0877 - 2264429 ద్వారా సంప్రదించగలరు.

కొనుగోళ్ల తంటా.. కల్లాల్లోనే పంట..

- కల్లాల్లో 20 రోజులుగా ధాన్యం
- కొనేవారే లేక రైతుల అవస్థలు
- అరా కొరగా చేతుకొచ్చిన వరిని కొనేవారు కరువు

ప్రజాశక్తి- కేవీబీ పురం

ఆరుగాలం పంటను సాగు చేసిన రైతుకు చివరి దశలో కష్టాలు తప్పడం లేదు. కష్టపడి పంట పండించి కోత కోసిన తరువాత కూడా ధాన్యం కొనుగోళు అవుతుందో లేదో అని రైతులకు ఎదురు చూడాల్సిన పరిస్థితి. కేవిబి పురం మండలంలో వరి రైతులు గత 20 రోజులుగా ధ్యానం కొనుగోలు చేసే మిలర్లు వ్యాపారస్తులకు కోసం ఎదురుచూస్తున్నారు. మండలంలో పలు గ్రామాల్లో బోరు బావుల కింద రైతులు వరి పంటను సాగు చేశారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో వరి పంట పెద్ద ఎత్తున నేలవాలింది. వర్షాన్ని తట్టుకుని చేతుకొచ్చిన అరకొర పంటను కొనేవారు లేక రైతులు ప్రభుత్వంపై ఆశగా ఎదురుచూస్తున్నారు.

పొలాల్లో కప్పలు పోసిన వరి ధాన్యం

ధాన్యం ఆరబెడుతున్న రైతులు

మండలంలోని రాయపేడు, ఆరే అంజూరు, బ్రాహ్మణపల్లి, వగత్తూరు, కెవిబి పురం, కలత్తూరు, ఎన్‌ఏ రాజులు కండ్రిగ గ్రామాలలో వరి కోత కోసి కుప్పలు వేసి అమ్మడానికి సిద్ధంగా ఉంచారు. ఒక ఎకరా 20 క్వింటాళ్ల దిగబడి రావాల్సి ఉండగా అకాల వర్షాలు వలన 5 క్వింటాల మించి దిగుబడి రాలేదు. ఉన్న అరకొర పంటను కూడా కొనేవారు లేక గత 20 రోజులుగా వరి ధాన్యాన్ని కలాల్లో వేసుకుని, కాపలాగా రైతులు అక్కడే ఉండవలసిన పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే ధాన్యం కుప్పలను కప్పుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

గత ఏడాది ప్రభుత్వం క్వింటాకు రూ.2250ల ధరతో కొనుగోలు చేసింది. ప్రస్తుతం రూ.1300 నుంచి 1500లకు మించి వ్యాపారస్తులు అడగడం లేదు. ఈ ధరలో పంటను విక్రయిస్తే పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి. మండలంలో స్థానికంగా మార్కెట్ యార్డ్ లేకపోవడంతో పంట విలువలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తమిళనాడు నుంచి కొందరు వ్యాపారస్తులు పంటను కొనేందుకు వస్తున్నారు, వారు కూడా అప్పు అడుగుతున్నారు. గతంలో ఇలా తమిళనాడు నుంచి వచ్చిన వ్యాపారస్తులు అప్పుగా పంటలు తీసుకుని వెళ్లి తరువాత డబ్బులు ఇవ్వకుండా రైతులకు చుక్కలు చూపించారు. ఈ నేపథ్యంలో ఇలాంటి వారికి పంటను అమ్మేందుకు రైతులు భయపడుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రజాప్రతినిధులు స్థానికంగానే వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేరలేదని రైతులు వాపోతున్నారు.

ధాన్యం కొనేవారి కోసం ఎదురుచూస్తున్నాం..

- మణి, రైతు, రాయపేడు

ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. డీఏపీ యూరియా కాంప్లెక్స్ ఎరువులు ప్రతి సంవత్సరం పెంచుకుంటూ పోతున్నారు. పంటకు మాత్రం కనీసం మద్దతు ధర ఇవ్వడం లేదు. పంటలకు ధరలు లేక పెట్టుబడులు కూడా చేతికందలేదు. ప్రస్తుతం వరి పంటను అమ్మకానికి సిద్ధంగా ఉంచినా కొనేవారు లేక కలాల్లో పంటలు వేసుకుని వ్యాపారుల కోసం ఎదురు చూస్తున్నాం..

ప్రభుత్వమే వరిని కొనాలి..

- దాసరి జనార్ధన్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

వరి పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. గత జనవరిలో క్వింటా రూ.2250ల ధరకు వరి అమ్ముడుపోయింది. ప్రభుత్వం ఈ ధర అటుంచి కనీసం కొనేందుకు వ్యాపారులెవరు ముందుకు రావడం లేదు. తక్కువ ధరతో ఇస్తే పంటలు కొనుగోలు చేసేందుకు దళారులు వస్తున్నారు. వీరికి ఈ పంటలు అమ్మితే పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికి రావు పైగా చేసిన అప్పులు తీర్చలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మద్దతు ధరతో పంటలు కొనుగోలు చేసి రైతులు ఆదుకోవాలి.

చల్లగా చూడమ్మా గంగమ్మ..

- ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకున్న సీఎం
- గంగమ్మకు రాష్ట్ర ప్రభుత్వ పట్టు వస్త్రాలు, సారె సమర్పణ

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : కుప్పం నియోజకవర్గం కుప్పం గంగమ్మ జాతరలో భాగంగా శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ తల్లికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారి సతీమణి నారా భువనేశ్వరితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం, టిటిడి తరపున అమ్మ వారికి పట్టు వస్త్రాలు, సారే సమర్పించారు. బుధవారం శ్రీ తిరుపతి ప్రసన్న గంగమాంబ అమ్మవారి జాతర నిమిత్తం బెంగళూరు ఎయిర్‌పోర్టు నుంచి గుడిపల్లి ద్రావిడ యూనివర్సిటీ ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు హెలిక్యాప్టర్‌లో చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కుప్పంకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. కుప్పంలో అత్యంత వైభవంగా నిర్వహించే శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలలో చివరి ఘట్టమైన అమ్మవారి విశ్వరూప దర్శనంతో చేసుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రికి ప్రభుత్వ విప్, ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, ఏపిఎస్ ఆర్‌టిసి వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఆలయ ఛైర్మన్ రవిచంద్రబాబు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట ముఖ్యమంత్రి కార్యదర్శి పిఎస్.ప్రద్యుమ్న, టిటిడి పాలకమండలి ఛైర్మన్ బీఆర్ నాయుడు, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పి మణికంఠ చందోలు, కడ పీడీ వికాస్ మర్మత్, టిటిడి పాలకమండల సభ్యులు వైద్యం శాంతారాం, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సెల్వం, నాయకులు డాక్టర్ సురేష్ బాబు, రాజ్ కుమార్, డాక్టర్ సుధీర్, సత్యేంద్ర శేఖర్ పాల్గొన్నారు.

సాదర వీడ్కోలు..

కుప్పం గంగమ్మ జాతరలో భాగంగా శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ తల్లికి కుటుంబ సమేతంగా పట్టు వస్త్రాలు సమర్పించి తిరిగి బుధవారం మధ్యాహ్నం 3.26 గంటలకు ద్రావిడ యూనివర్సిటీ ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి బెంగుళూరుకు బయలుదేరిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సాదర వీడ్కోలు లభించింది. అనంతపురం రేంజ్ డీఐజీ హిమోషి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఎమ్మెల్సీ, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కె.మురళీమోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, అధికారులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.

'శ్రీ పద్మావతీ హృదయాలయ' నిర్వహణపై ఈవో సమీక్ష

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతిలోని శ్రీపద్మావతీ చిన్నపిల్లల హృదయాలయంలో చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణ, వైద్యసేవల దృష్ట్యా టిటిడిలో కొత్తగా ఓ ట్రస్ట్ ఏర్పాటుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని టిటిడి ఈవో జె. శ్యామల రావు అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్వహణపై అధికారులతో ఆసుపత్రి సమావేశ మందిరంలో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీపద్మావతీ చిన్నపిల్లల హృదయాలయంలో ఇప్పటికే శ్రీవేంకటేశ్వర ఆపన్న హృదయం స్కీమ్ ఉందని, ఈ స్కీం క్రింద రూ.లక్ష దాత విరాళం అందిస్తే నిరాదరణకు గురైన పేద వర్గాలకు చెందిన ఒక పిల్లవాడికి ఉచితంగా ఆపరేషన్ చేసే సదుపాయం ఉందన్నారు. టిటిడిలో ఇప్పటికే ఉన్న పలు ట్రస్ట్ తరహాలో నూతనంగా చిన్నపిల్లల వైద్యసేవల కోసం ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటుకు సంబంధించిన నియమ నిబంధనలపై నివేదిక తయారు చేయాలని అన్నారు. చిన్న పిల్లలను దైవ సమానులుగా భావించి, ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే పసి బిడ్డలకు చక్కటి వైద్యసేవలు అందిస్తున్నారని ఆయన అన్నారు. పిల్లలకు సంబంధించి గుండె చికిత్సలతో పాటు చిన్నపిల్లల గుండె సర్జరీల సంఖ్యను పెంచేందుకు అవసరమైన వైద్య పరికరాలు, మౌళిక సదుపాయాలు, అత్యవసర మందులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నూతన భవన నిర్మాణం తాజా పరిస్థితిపై ఆయన ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష చేసి తాజా పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చిన్న పిల్లల ఐసియూ బ్లాక్, జనరల్ వార్డు, ఓపి బ్లాక్‌లోని పిల్లలకు అందుతున్న వైద్యసేవలపై వైద్యులను, పిల్లల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు ఆసుపత్రిలో అందుతున్న వైద్యసేవలపై తమ సంతృప్తిని ఈవోకు తెలియజేశారు. కార్యక్రమంలో టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మం, సీఈ టివి.సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎన్.శ్రీనాథ్ రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ భరత్, ఎస్ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం అధికారులు పాల్గొన్నారు.

స్విమ్స్ సిటి సర్జరీ విభాగంలో

సంక్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

స్విమ్స్ సిటి సర్జరీ విభాగంలో సంక్లిష్టమైన ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించ్చినట్లు సిటి సర్జరీ విభాగధిపతి డాక్టర్ సత్యవతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కర్నూలు జిల్లా, మంత్రాలయ మండలం, పరమాన్ దొడ్డి తాండా గ్రామంకు చెందిన ఎస్.అన్నాబాయ్ (24) మహిళ స్విమ్స్ సిటి సర్జరీ విభాగంలో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఈనెల 1వ తేదిన అడ్మిట్ అయినట్లు తెలిపారు. అన్నాబాయ్ అనే మహిళ అఖండ్రోప్లాసియా (మరగుజ్జు) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ స్విమ్స్‌కు వచ్చారని, పరీక్షలు నిర్వహించిన అనంతరం గుండెలో రెండు కవాటాలు దెబ్బతిన్నాయని వాటిని మార్చడం జరిగిందని, అఖండ్రోప్లాసియా వల్ల శస్త్రచికిత్స సంక్లిష్టమైనదిగా మారిందని పేర్కొన్నారు. ఇది ప్రపంచంలోనే మొదటిసారిగా ఇటువంటి అఖండ్రోప్లాసియా ఆపరేషనను స్విమ్స్ చేయడం జరిగిందని తెలిపారు. సంక్లిష్టమైన శస్త్రచికిత్సలో డాక్టర్ ఆర్‌వి. కుమార్, డాక్టర్ సత్యవతి, డాక్టర్ చిరంజీవి, డాక్టర్ ధీరజ్, డాక్టర్ విష్ణు, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ అలోక్ సామంత్ రే, డాక్టర్ సుముధ, ఇతర వైద్యులు పాల్గొని విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా పేషెంట్ ఎస్.అన్నాబాయ్ తల్లి చంద్రమ్మ మాట్లాడుతూ ఈ ఆపరేషన్‌కు ఖర్చయ్యే దాదాపు రూ.5లక్షలు టిటిడి. ప్రాణదానం ట్రస్టు ద్వారా పూర్తిగా ఉచితంగా నిర్వహించడం జరిగిందని, ఆపరేషన్‌కు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించిన టిటిడి యాజమాన్యనికి, ఛైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామల రావు, స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి.కుమార్‌కి వారి వైద్యబృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్‌వి.కుమార్ మాట్లాడుతూ స్విమ్స్ ఇలాంటి సంక్లిష్ట ఆపరేషన్లు చేయడం అభినందనీయమని, విజయవంతమైన ఆపరేషన్ నిర్వహించిన సిటి సర్జరీ, అనస్థీషియా విభాగాల వైద్య బృందానికి అభినందనలు తెలియజేశారు.

ఏపీఈ ఏపిసెట్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఇంచార్జీ విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అప్పారావు తిరుపతిలోని టిసియస్ ఆయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో ఏపీ ఉన్నత విద్యామండలి పక్షాన జరుగుతున్న ఏపీ ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, కామన్ ఎంట్రన్స్-2025 పరీక్ష కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో పరీక్ష ప్రశాంతంగా జరుగుతున్నాయని అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వవిద్యాలయం, కాకినాడ వారు ఈపరీక్షలు వారు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 21 నుంచి 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

న్యూ లుక్‌లో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్

- నేడు వర్చువల్ విధానంలో ప్రధాని మోడీ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో:

అమృత్ భారత్ పథకం కింద దేశంలో ఉన్న రైల్వేస్టేషన్లో కేంద్రరైల్వే శాఖ మరమ్మతులు చేస్తూ న్యూలుక్ రైల్వే స్టేషన్లుగా ప్రారంభిస్తుంది. అందులో భాగంగా తిరుపతి జిల్లా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ఆధునికరించి నేడు ప్రధాని మోడీ చేతులు మీదుగా వర్చువల్ విధానం ద్వారా గురువారం ప్రారంభించనున్నారు. అమృత్ భారత్ పథకం కింద రాష్ట్రంలో సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను కంప్లీట్‌గా న్యూలుక్‌లో రెడీ అయిపోయింది. గురువారం ప్రధాని మోడీ చేతుల మీదుగా సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ ప్రారంభం కాబోతుంది. అమృత్ పథకంలో భాగంగా తొలిసారి ప్రారంభం కాబోతున్న స్టేషన్‌గా సూళ్లూరుపేట ఏపీలో చరిత్ర సృష్టించడానికి రెడీ అయిపోయింది.

సూళ్లూరుపేట స్టేషనే ఎందుకంటే..

సూళ్లూరుపేట ఏపీ, తమిళనాడు బోర్డర్లో ఉన్న పెద్ద టౌన్. ఇక్కడికి తమిళనాడు బోర్డర్ కేవలం 12 కిలోమీటర్లు మాత్రమే. ఈ స్టేషన్ దాటాక అక్కంపేట, తడ స్టేషన్లు దాటితే చాలు తమిళనాడులోకి ఎంటర్ అయిపోతాం. ఈ స్టేషన్ గుండా 42 ఎక్స్‌ప్రెస్ రైళ్లు, 28 ఈ ఏమియు ట్రైన్స్ ప్రయాణం చేస్తుంటాయి. సూళ్లూరుపేటను (నాన్ సబర్బన్ (గ్రూపు) కేటగిరీలో ఉంచింది ఇండియన్ రైల్వే. అంటే రోజుకి కనీసం 9,000 మందికి పైగా ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి జర్నీ చేయాల్సి ఉంటుంది. భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం ఇస్రో ఇక్కడికి జస్ట్ 18 కిలోమీటర్లు. అలాగే ప్రాచీన చెంగాలమ్మ ఆలయం ఈ ఊర్లోనే ఉంది. ప్రతి శాటిలైట్ ప్రయోగానికి ముందు ఇస్రో శాస్త్రవేత్తలు చెంగాలమ్మ ఆలయాన్ని సందర్శించడం ఒక ఆనవాయితీగా వస్తోంది. నేలపట్టు పక్షుల అభయారణ్యం, పులికాట్ సరస్సు ఇక్కడికి అతి సమీపంలో ఉన్నాయి. ఇలా సూళ్లూరుపేట ఏ విధంగా చూసినా ఏపీలో ముఖ్యమైన టౌన్‌గా ఉంటూ వస్తోంది. ఇవన్నీ గమనించి ఈ స్టేషన్ను డెవలప్ చేయడానికి రూ.14.5 కోట్లను కేటాయించింది కేంద్రం. ఆ నిధులతో కనీ విని ఎరుగని స్థాయిలో సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌ను రెడీ చేశారు అధికారులు.

స్టేషన్ ప్రత్యేకతలు ఇవే..

సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ప్రస్తుతం ఎవరైనా తెలియని వాళ్ళు బయటినుంచి చూస్తే ఒక చిన్న సైజు ఎయిర్పోర్టు లాగా కనిపిస్తుంది. పూర్తిగా ట్రెడిషనల్ లుక్ ఉట్టిపడేలాగా స్టేషన్కు ఎలివేషన్ ఇచ్చారు. అలాగే హైటెక్ రిజర్వేషన్ కౌంటర్, లైట్లతో వెలిగిపోయేలా సీలింగ్ , అధునాతన సీటింగ్ సౌకర్యం, ప్లాట్ ఫామ్‌ల మధ్య మారడానికి రెండేసి లిఫ్టు, క్రొత్త ప్లాట్ ఫామ్‌లు ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లు ఉండేలా స్టేషన్‌ను డిజైన్ చేశారు. ఎక్కడికి అక్కడ వాటర్ ఫెసిలిటీతో పాటు భవిష్యత్తు అవసరాలకు పనికొచ్చేలా కంప్లీట్‌గా న్యూలుక్‌లో రైల్వే స్టేషన్ రెడీ చేసినట్టు చెన్నైకు చెందిన గతిశక్తి అధికారి డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ వెంకటేశన్, చెన్నై డివిజన్ పిఆర్‌ఓ ఏలుమలై తెలిపారు.

ప్రధాని చేతుల మీదుగా రేపే ప్రారంభం

పూర్తిగా న్యూ లుక్‌లోకి మారిపోయిన సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను రేపు ప్రధాన మోడీ స్వయంగా వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీనితోపాటు దేశవ్యాప్తంగా వందకు పైగా స్టేషన్లను ఆయన వర్చువల్ పద్ధతిలో దేశానికి అంకితం చేస్తారు. ఏపీలో నిర్మాణంలో ఉన్న మిగిలిన అన్ని అమృత్ భారత్ స్టేషన్‌లకు ఒక రోల్ మోడల్‌గా సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ రెడీ అయ్యిందని స్థానికులు సంబరపడుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: రహదారి ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పక్కా ప్రణాళికతో కృషి చేయాలని, టూవీలర్ వాహనాల చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫిరన్స్ హాల్‌లో జరిగిన జాతీయ రహదారులపై నిత్యం జరిగే ప్రమాదాలపై జిల్లా రహదారి భద్రత కమిటీ సభ్యులతో కలెక్టర్, ఎస్పీ సమీక్ష సమేవేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నాయుడుపేట -పూతలపట్టు జాతీయ రహదారిపై ఇప్పటివరకు జరిగిన రహదారి ప్రమాదాలపై ఆడిట్ నిర్వహించాలని, జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. జిల్లాలో పోలీస్, రవాణా శాఖ వారు సంయుక్తంగా నిర్వహించి గుర్తించిన 100 ప్రమాద బ్లాక్ స్పాట్స్ పై నివేదికను జాతీయ రహదారి అధికారులను కోరారు. తిరుమల ఘాట్ రోడ్లపై ఫిట్నెస్ లేని వాహనాలను ఎటువంటి పరిస్థితుల్లో అనుమతించరాదని ఆదేశించారు. అలాగే పూర్తిస్థాయిలో ఘాట్ రోడ్డును నాన్ స్టాప్ జోన్‌గా పరిగణించాలని దానికి సంబంధిత చర్యలను తీసుకోవాలని టిటిడి విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1033 విధిగా అందరు ప్రయాణికులు వినియోగించేలా ఆ టోల్ ఫ్రీ నెంబర్ గురించి అవగాహన ఉండేలా అందరి అధికారులతో కలసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని శాఖలు విడివిడిగా కాకుండా సమన్వయంతో కలిసి పనిచేయాలని తెలియజేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి మురళి మోహన్, ఎస్ఈ, ఆర్ అండ్ బి మధుసూదన్ రెడ్డి, నెల్లూరు, తిరుపతి, చెన్నై ఎన్‌హెచ్ ఏఐ పిడిలు పాల్గొన్నారు.

తిరుపతిని సంతోషకరమైన నగరంగా తీర్చిదిద్దుతా..

- తుడా అభివృద్ధికి పరుగులు పెట్టిస్తా..
- గత పాలకులు చేసిన తప్పులు నేను చేయను..

నూతన ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి

తుడా కార్యాలయంలో..

బహిరంగ సభలో మాట్లాడుతున్న నూతన తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

శుభాకాంక్షలు తెలుపుతున్న చిత్తూరు ఎంపి..

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి నగరాన్ని సంతోషకరమైన నగరంగా శాంతియుతంగా ఉండే నగరంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తానని, తుడాలో గత పాలకులు చేసిన తప్పులు అవినీతి తాను చేయబోనని నిజాయితీ గల ఛైర్మన్‌గా వ్యవహరిస్తానని తుడా నూతన ఛైర్మన్ డాక్టర్ డాలర్స్ సి.దివాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం తుడా ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత సాయంత్రం చంద్రగిరి నియోజకవర్గ పెరుమాళ్లపల్లి వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. ఇందిరా ప్రియదర్శిని కూరగాయలు మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఛైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి అంటేనే సంతోషకరమైన నగరంగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. భారతదేశంలో తిరుపతి నగరంలో జీవించాలంటే శాంతియుతంగా నగరంగా ప్రజలందరూ అనుకునే విధంగా చేస్తానన్నారు. ఇక్కడ దౌర్జన్యాలు, భూకబ్జాలు ఉండవని చెప్పారు. తుడా పరిధిలో ఉండే అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. తుడా ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన అప్పటి నుంచి మంచి పాలన అందించడానికి తాను ఎక్కువ ప్రయత్నం చేస్తానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకునే విధంగా తన పాలన ఉంటుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం తనకి ఎన్నో రకాలుగా ఇబ్బందులు గురిచేసిందని గుర్తు చేశారు. ఓ ప్రజాప్రతినిధి తన రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అభివృద్ధి కాకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. తనకు సంబంధించిన రియల్ ఎస్టేట్లో ఉండే లేఅవుట్లు అనుమతులు ఇవ్వకుండా తుడాలో ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. గత ప్రభుత్వంలో తుడా ఛైర్మన్ పదవిని అడ్డుపెట్టుకొని వారికి కావలసిన వారికి పనులు చేయడమే కాకుండా తుడా నిధులను భారీగా దుర్వినియోగం చేశారన్నారని, తాను తుడాను అభివృద్ధి చేయడమే కాకుండా తుడా అంటే ఒక బ్రాండ్‌ను తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటానని అన్నారు. తుడా భూములు కబ్జా కాకుండా వాటిని పరిరక్షించే తూడాకు ఆదాయం పెంచేలా చేస్తామన్నారు. తనకి పదవి ఇచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, గూడూరు సూళ్లూరుపేట, పూతలపట్టు, వెంకటగిరి ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, నెలవల విజయలక్ష్మి, రామకృష్ణ, మురళీమోహన్, టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, తిరుపతి టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, చేనేత జోలి శాఖ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బిజెపి శ్రీకాళహస్తి నాయకులు కోలానంద్, ఎస్సీ కార్పొరేషన్ మెంబర్ కుమారమ్మ, టిడిపి నాయకులు మబ్బు దేవ నారాయణరెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్‌సి.మునికృష్ణ, టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, కార్పొరేటర్ అన్నా అనిత యాదవ్, మాజీమంత్రి పరసారత్నం, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షురాలు పుష్పావతి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా డాక్టర్ సి డాలర్స్ దివాకర్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైస్‌ఛైర్మన్ ఎన్.మౌర్య, ఛైర్మన్‌గా దివాకర్ రెడ్డి బాధ్యతలు తీసుకుంటూ ఆయన పలు ఫైళ్లపై సంతకాలు చేశారు. అంతకు ముందు తుడా కార్యాలయంలో పూజలు నిర్వహించి తర్వాత బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తుడా సిబ్బందితో దివాకర్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుడా ఛైర్మన్ మాట్లాడుతూ తుడా అభివృద్ధికి అందరం ఐక్యమత్యంగా కలిసి పనిచేస్తూ అభివృద్ధిలో ముందుకు పోవాలని సూచించారు. తుడా పరిధిలో ఉండే గ్రామాలు అభివృద్ధి చేయడానికి సిబ్బంది కూడా తన వంతు కృషి చేయాలని సూచించారు. అనంతరం తుడా ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్రయ్య, డీఈలు ఎస్.బాష, నరేష్ కుమార్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ దేవీకుమారి, ప్లానింగ్ అధికారి వాసుదేవ నాయుడు, పలువురు ఉద్యోగులు అధికారులు రాజకీయ నేతలు నూతన ఛైర్మన్ దివాకర్ రెడ్డి సత్కరించారు.

అలాగే చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఛైర్మన్ సొంతూరు పెరుమాళ్ళ పల్లెల్లోని డాలర్స్ నివాసంలో పుష్పగుచ్చాలందించి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డిని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అభినందనలు తెలిపారు.

గంగమ్మ జాతరలో మాజీ మంత్రి రోజా

మాజీ మంత్రి రోజాకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం నేసనూరు గ్రామంలో బుధవారం గంగమ్మ జాతర వైభవముగా నిర్వహించారు. ఈ జాతరలో మాజీ మంత్రి ఆర్కే రోజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మునివేలమ్మ, సర్పంచ్ గోవింద స్వామి రెడ్డి, అన్నా లోకనాథం, సర్పంచ్ మునిశేఖర్, సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మునిరాజా నాయుడికి శుభాకాంక్షల వెల్లువ

మునిరాజా నాయుడిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులుగా నియమితులైన రావిళ్ల మునిరాజా నాయుడుకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బుధవారం ఆయన నివాసానికి చేరుకున్న కార్యకర్తలు, అభిమానులు మునిరాజా నాయుడిని శాలువ, పూలమాలలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మునిరాజానాయుడు మాట్లాడుతూ పదవి తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. బొజ్జల ఆశయాలతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కార్యకర్తలతో కలిసి తనవంతు పాటు పడతానన్నారు. మండలాన్ని జిల్లాకే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకముంచి పదవీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఐటీఐలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరురెండో పట్టణ పరిధి, తిలక్ నగర్ ప్రాంతంలో ఉన్న ఐటిఐ కళాశాలలో ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్ట్ ఆదేశాల మేరకు ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలకు జిల్లాలోని గూడూరు, వెంకటగిరి, చిట్టేడు, వాకాడు మండలాల్లో ఉన్న ఐటిఐ కళాశాల విద్యార్థులు హాజరయ్యారు. గూడూరులోని నెల్ క్యాస్ట్, అరబిందో ఫార్మా కంపెనీ, కైసర్ ప్రొడక్ట్స్ తదితర కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిఐ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ వివిధ కంపెనీల్లో 180 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించాయని తెలిపారు.

రావిళ్లను సత్కరించిన తెలుగు తమ్ముళ్లు

రావిళ్ల మునిరాజా నాయుడిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండల టీడీపీ అధ్యక్షులుగా నియమితులైన రావిళ్ల మునిరాజా నాయుడును ఆ మండల టీడీపీ నేతలు బుధవారం ఘనంగా సత్కరించారు. మునిరాజా నాయుడు ఆధ్వర్యంలో మండలం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని నేతలు ఆకాంక్షించారు. మునిరాజానాయుడు సారథ్యంలో తామంతా టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసునాయుడు, శంకర్ నాయుడు, రమాదేవి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ప్రచార బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -క్యాంపస్: యస్వీయులో "యోగాంధ్ర-2025" ప్రచారానికి మద్దతుగా రాష్ట్ర ప్రభుత్వంతో చేతులు కలిపి విశ్వవిద్యాలయ అధికారులు బుధవారం ఇంచార్జీ ఉపకులపతి ఆచార్య సిహెచ్. అప్పారావు ఛాంబర్‌లో బ్రోచర్‌ను విడుదల చేశారు. జూన్ 21న విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఈ కార్యక్రమం రూపొందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీలో గురువారం నుండి 21 వరకు "యోగా మాసం" జరుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దీపారాణి త్వరగా కోలుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం: బస్సు ప్రమాదంలో గాయపడ్డ టిడిపి కార్యకర్త శ్రవణ్ కుమార్ భార్య దీపారాణి త్వరగా కోలుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు.

దళిత విద్యార్థిపై దాడి హేయం

ప్రజాశక్తి - సత్యవేడు : ఇటీవల బీటెక్ విద్యార్థి జేమ్స్‌ని కిడ్నాప్ చేసి దారుణంగా కొట్టి, కులం పేరుతో దూషించి, రాక్షసంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిపట్టు రాఘవయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సత్యవేడు మండల కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ఘటనలో ఇన్వాల్వ్ అయిన ప్రతి ఒక్కరిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తిరుపతి పోలీస్ శాఖ వారికి విజ్ఞప్తి చేశారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోకి విలీనమైన శెట్టిపల్లి గ్రామం, గుంటవీధి వద్ద డ్రైనేజీ పొంగిపొర్లుతూ దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీళ్ల పైపులైను పనుల కోసం చేపట్టిన తవ్వకాలలో డ్రైనేజీ పైపులైను పగిలిపోయింది. గడిచిన 30 రోజులుగా స్థానికులు దోమలతో ఇబ్బంది పడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులను పరిష్కరించాలని కోరినా స్పందించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అత్తూరు జాతరలో ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, అత్తూరు గ్రామ పంచాయతీలో బుధవారం అత్తూర్ నడివీధి గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ జాతరకు ముఖ్యఅతిథిగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల టిడిపి నాయకులు పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, ఓబుల్ రెడ్డి, హరి రెడ్డి, నీలకంఠారెడ్డి, మునస్వామి, భాస్కర్ రెడ్డి, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నేతల డిమాండ్

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ యశోద నగర్, వేమన విజ్ఞాన కేంద్రంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ అధ్యక్షతన బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, ఐద్వా జిల్లా జట్టి గుర్రప్ప, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షులు అంజయ్య, టిడిటి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం నాయకులు ప్రసాదరావులు మాట్లాడుతూ దళిత విద్యార్థి జేమ్స్ సినీ నటుడు మోహన్ బాబు విద్యాసంస్థల్లో బీటెక్ చదువుతున్నాడని, అదే విద్యాసంస్థలో చదువుతూ ఆగిపోయిన రౌడీ షీటర్ రూపేష్, అతని స్నేహితుడు చోటా గ్యాంగ్ భేడ బాబు తదితరులు కలిసి జేమ్స్ ను ఎల్లెట్ పార్కు హోటల్లో బంధించి కులం పేరుతో దూషిస్తూ, చిత్రహింసలకు గురి చేస్తూ, దాడి చేసి చంపడానికి ప్రయత్నించారన్నారు. జరిగిన సంఘటనపై తిరుచానూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే పోలీసులు కేసును నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించారన్నారు. బాధితునిపై మహిళ ఎస్పై ఒత్తిడి చేయడాన్ని తప్పు పట్టారు. దళితుల సమస్యలు పోలీసులకు పట్టవా అని ప్రశ్నించారు. జరిగిన సంఘటనపై పోలీస్ ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు రౌడీ షీటర్ రూపేష్, చోటా గ్యాంగ్ భేడ బాబులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని కోరారు. కేసును నిర్వీర్యం చేయడానికి ప్రయత్నించిన మహిళ ఎస్పై అరుణపై తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. జేమ్స్‌కు చదువుతున్న కోర్సు పూర్తి చేయడానికి రక్షణ కల్పించాలని అన్నారు. తిరుపతి నగరంలో చదువుతున్న విద్యార్థులకు కూటమి ప్రభుత్వం రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు అంగేరి పుల్లయ్య, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎన్.డి. శ్రీనివాసులు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.రఘు, అంబేద్కర్ సంఘం చైర్మన్ ధన శేఖర్, మైనార్టీ సంఘం నాయకులు రఫీ, వీసీకే పార్టీ అడ్వకేట్ రమేష్, దళిత హక్కుల పోరాట సంఘం నాయకులు నాగభూషణం, మహిళా సంఘం నాయకులు సాయి లక్ష్మి, సిఐటియు నాయకులు ఎస్ జై చంద్ర, రైతు సంఘం నాయకులు పి హేమలత, సిపిఎం నగర కార్యదర్శి కె వేణుగోపాల్, సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, ఎం మాధవ్, పి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : భారతదేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్ రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ విప్లవాన్ని దేశంలోకి తీసుకొచ్చిన దార్శనికుడు రాజీవ్ అని కొనియాడారు. దేశంలో అవినీతి నిరోధక చట్టంలో మార్పులు, దళితులపై దాడులు అరికట్టేందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి యాక్టురే పదును పెట్టి, దళితుల శ్రేయసుకు కృషి చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు యార్లపల్లి గోపి ఆధ్వర్యంలో బుధవారం పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యార్లపల్లి గోపి మాట్లాడుతూ 18 సంవత్సరాలకు ఓటు హక్కు, పంచాయతీరాజ్ చట్టం, రాజకీయ ఫిరాయింపులు చట్టం ఆయన తీసుకొచ్చనవేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అడ్వకేట్ రవి, అబ్దుల్ మజీద్ పటేల్, పుత్తూరు సిద్దయ్య (చిన్నారావు)మించల తేజవతి, బేరిపల్లి వెంకటేష్ గౌడ్, పట్నం భాస్కర్ గౌడ్, మున్వర్, సమీనుల్లా, వీర మోహన్, బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : భారత దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప దార్శనికుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయ కర్త తలపా దామోదరం రెడ్డి అన్నారు. బుధవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దామోదరం రెడ్డి, పీపుల్స్ నర్సింగ్ హోంలో డాక్టర్ బత్తెయ్య నాయుడు రాజీవ్ గాంధీ చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

ఘనంగా మినీ మహానాడు

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

ప్రజాశక్తి - నాయుడుపేట: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు యుగ పురుషుడని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కొనియాడారు. తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేట పట్టణంలోని కేకే కళ్యాణ మండపంలో బుధవారం మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్, తిరుపతి జిల్లా టిడిపి అధ్యక్షులు గొల్ల నరసింహ యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్‌ల సారథ్యంలో టీడీపీ ఒక మహాశక్తిగా ఎదుగుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో అభివృద్ధిని మరచి, టీడీపీ కార్యకర్తల మీద అక్రమ కేసులు పెట్టి అరాచకాలు సృష్టించారన్నారు. కార్యకర్తలకు టీడీపీ నాయకులు అండగా నిలబడటంతో ధైర్యంగా అక్రమ కేసులు ఎదుర్కొని పార్టీ గెలుపుకు కృషి చేసినందుకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్, వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, సూళ్లూరుపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి సీనియర్ నాయకులు సిరసనంభేటి విజయభాస్కర్ రెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షులు మునిసిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ, పట్టణ యువ నాయకులు నెలవల రాజేష్, నియోజకవర్గంలోని ఆరు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కౌన్సిల్ సమావేశంలో మర్రి రాఘవయ్య తదితరులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, విజయవాడ డివిజన్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంప్లాయిస్ సంఘ్ ఆల్ ఇండియా జనరల్ సెక్రెటరీ మర్రి రాఘవయ్య హాజరయ్యారు. ఉదయం నుండి పలువురు అధికారులు, కార్మికులతో మర్రి రాఘవయ్య పలు అంశాలపై చర్చించారు. ఉద్యోగ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ కౌన్సిల్ సమావేశంలో కార్మికులు, ఉద్యోగులు పలు సమస్యలు తెలియజేశారని విజయవాడ డివిజన్‌లో గూడూరు జంక్షన్‌కు ఎంతో గుర్తింపు ఉందన్నారు. నూతన రైల్వే లైన్ నిర్మించడంతో కొత్త రైల్వే స్టేషన్లు ఏర్పాటు అయ్యాయని తగినంత సిబ్బంది లేని కారణంగా ఉన్నవారికి పని ఒత్తిడి ఎక్కువగా ఉందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చేందుకు త్వరలో అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అవసరమైతే పోరాటానికి సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. వందే భారత్ రైళ్లకు గూడూరులో స్టాపింగ్ ఇప్పించేలా అధికారులతో చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో నాగేంద్రబాబు, ఆమంచి వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటేశ్వరరావు, పలువురు ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

నీటి సమస్యల పరిష్కారానికి పరిశీలన

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పురపాలక సంఘం, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమంత్ రెడ్డి ఆధ్వర్యంలో సూళ్లూరుపేట కమిషనర్ కె.చిన్నయ్య పురపాలక సంఘంలో నీటి సమస్య పరిష్కారం కొరకు పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. సూళ్లూరుపేట పురపాలక సంఘ పరిధిలో వేసవి కాలం ప్రజలకు నీటి సమస్య అధిగమించేందుకు పిండిపాలెం ఎస్ ఎస్ ట్యాంక్, తలంపాడు, కాసారెడ్డి పాలెంలలో నీటి బోర్లు పనితీరును, శ్రీనగర్ కాలనీలో నీటి పైపును పర్యవేక్షించడం జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ పలు ప్రాంతాల్లో ప్రజలను నీటి సమస్య గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ యం.మనోజ్, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ ఓటర్లు లేని జాబితాను తయారు చేయండి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): దొంగ ఓటర్లు లేని జాబితాను తయారుచేసి ప్రజాస్వామ్యానికి నిజమైన నిర్వచనం ఇవ్వాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి కోరారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి సుధా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసిపి పాలనలో దొంగ ఓట్లు విచ్చలవిడిగా చేర్చారని ఆరోపించారు. నియోజకవర్గంలోని ప్రతి బూతులో క్షుణ్ణంగా ఓట్ల పరిశీలన జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను సుధా రెడ్డిని కోరారు.

గంగుడు పల్లెను సందర్శించిన టీటీడీ బోర్డు సభ్యులు

కుటుంబ సభ్యులతో టీటీడీ బోర్డు సభ్యులు కోటేశ్వరరావు

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి) : టీటీడీ బోర్డు సభ్యుడు కోటేశ్వరరావు బుధవారం సతీసమేతంగా చంద్రగిరి మండలం గంగుడు పల్లె గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన అప్పి రెడ్డి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు అతిథిగా విచ్చేసిన ఆయనకు గ్రామస్థులు స్వాగతం పలికారు. అప్పిరెడ్డి కుటుంబ సభ్యులు, స్నేహితులు కోటేశ్వరరావు దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ "గంగుడు పల్లె లోయలు, కొండల నడుమ ప్రకృతి సౌందర్యంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉందన్నారు. శ్రీవారి సేవ చేసే అరుదైన అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడు, ఇతర బోర్డు సభ్యుల సహకారంతో తిరుమల దేవస్థాన ప్రతిష్టను మరింత పెంచే విధంగా పనిచేస్తాం," అని వెల్లడించారు. తదుపరి, ఆయనను చిత్తూరు జిల్లా, వెదురు కుప్పం మండలం, కొండారెడ్డి ఊరులోని శ్రీ కనుగొండ రాయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు కలసి, పురాతన ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ నుంచి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా గంగమ్మ జాతర

సారె తీసుకువస్తున్న ఎమ్మెల్యే నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రపురం: చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండలం రాయల చెరువు, నెన్నూరులలో గంగమ్మ జాతరను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధా రెడ్డి గంగమ్మకు సారె సమర్పించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు పులివర్తి సుధా రెడ్డి తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ మేకల తిరుమలరెడ్డి, మాధవి రెడ్డి, పసుపులేటి విజయ్ కుమార్, బాదూరు ధనంజయలు, నాగభూషణం, టిడిపి నాయకులు ప్రభాకర్ రెడ్డి, దినేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మాదాసు మాధవయ్య, నాగమణి యాదవ్ జయచంద్ర నాయుడు, మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నెన్నూరులో గంగమ్మను దర్శించుకున్న భూమన కరుణాకర్ రెడ్డి

నెన్నూరు గ్రామంలో జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన గంగమ్మకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్సార్సీపి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టి.గిరిధర్ రెడ్డి, సిద్ధముని రెడ్డి, ఎన్.యోగానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగిన సర్వసభ్య సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - నాగలాపురం: వైసిపి ఎంపిటిసి సభ్యులు గైర్హాజరుకావడంతో సర్వ సభ సమావేశం వాయిదా పడింది. కానీ సర్వసభ సమావేశాన్ని వాయిదా వేయడానికి నిర్ణయం తీసుకున్నప్పుడు ముందుగా ఎందుకు తేదిని ఖరారు చేశారని టిడిపి ఎంపీటీసీ సభ్యులు ప్రేమ సెల్వ కుమార్ ప్రశ్నించారు. బుధవారం నాగలాపురం ఎంపీడీవోకార్యాలయంలోలో ఎంపీపీ సింధు శ్యామ్ అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించడానికి ఎంపీపీ, అధికారులు తేదిని ఖరారు చేశారు. దీంతో అధికారులు, కూటమి నాయకులు ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ఆహ్వానించారు. ఎమ్మెల్యే సమావేశానికి హాజరయ్యారు. కానీ వైసీపీ ఎంపిటిసి సభ్యులు రాకపోవడంతో సభ్యులు తక్కువయ్యారని అధికారులు కోరం లేకుండా సమావేశాన్ని నిర్వహించేందుకు నిరాకరించారు. పసుపు రంగులు పూసి, టీడీపీ బ్యానర్లు కట్టినందువల్లే తాము రాలేదని వైసీపీ ఎంపిటిసి సభ్యులు తెలిపారు. ఏదైనా సమస్యలు ఉంటే మండల స్థాయి అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే ఈ సమావేశంలో పాల్గొన్నప్పుడు వాటిని పరిష్కారం చేసుకోవాలి తప్ప ఇలా వాయిదాలు వేయడం మంచి పద్ధతి కాదని ఎంపిటిసి ప్రేమ సెల్వ కుమార్ విమర్శించారు. అనంతరం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మండల సమస్యలను తమ దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, తొర్రూరు గ్రామంలో బుధవారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల పార్టీ అధ్యక్షులు ఆరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మాజీ పార్టీ అధ్యక్షుడు, రవి కుమార్, టిడిపి నాయకులు, ఆదిమందుడి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మండలం పొట్టిగుట్టలు (శిరుగురాజుపాలెం) వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని పాపా నాయుడు పేటకు చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బుధవారం ఉదయం 11.00 గంటలకు కృష్ణయ్య ద్విచక్ర వాహనంపై పాపా నాయుడుపేట నుండి పుత్తూరుకి బయలుదేరారు. శిరుగురాజుపాలెం వద్దకు రాగానే అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి ద్విచక్ర వాహనంపై రోడ్డుమీదకు వేగంగా వస్తున్న సమయంలో రెండు వాహనాలు ఢీకొని ఇద్దరు రోడ్డుపై పడిపోయారు. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

గొర్రెల మందను ఢీకొట్టిన లారీ

మృతి చెందిన గొర్రెలు

ప్రజాశక్తి - బుచ్చి నాయుడు కండ్రిగ: మండలంలోని కారణమెట్ట మలుపు వద్ద బుధవారం ఉదయం ఓవర్ లోడ్‌తో చెన్నై వైపు వెళుతున్న టిప్పర్ లారీ గొర్రెల మందను ఢీకొనింది. కారణమెట్ట గ్రామానికి చెందిన వెంకటయ్య, భార్య గురవమ్మ, వారి కుమారుడు గొర్రెలు మేపడానికి రోడ్డు మీద తీసుకెళుతుండగా, శ్రీకాళహస్తి నుండి చెన్నైకు ఓవర్ లోడ్‌తో వెళుతున్న టిప్పర్ ఒక్కసారిగా గొర్రెల మందను ఢీకొనింది. దీంతో 23 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందగా, మరో 17 గొర్రెలు తీవ్ర గాయాల పాలయ్యాయి. మూగజీవాల ఆర్తనాదాలు విన్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని విచారం వ్యక్తం చేశారు. సుమారు రూ.6 లక్షలు నష్టం జరిగిందని తెలిపారు. ఈ ఘటనతో గొర్రెలు కాపరి గురవమ్మ స్పృహ కోల్పోయింది. తమ జీవనోపాధి పోయిందని ఆమె కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీ ఓనర్‌తో మాట్లాడి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని తెలిపారు. టిప్పర్ డ్రైవర్ కాలిరత్నం (32)ను రాజుపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దార్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

యోగా డేని విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : యోగాంధ్రా 2025కు విస్తృత ప్రచారం కల్పించడంలో భాగంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో యోగా కార్యక్రమాన్ని బుధవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. యోగా మాస్టర్లు ప్రజాప్రతినిధులు, అధికారులతో యోగ ఆసనాలను ప్రాక్టీస్ చేయించారు. సీఎం, డిప్యూటీ సిఎంల ఆధ్వర్యంలో విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా డేను ఐదు లక్షల మందితో నిర్వహించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడి విశాఖపట్నంలో జరిగే యోగా డే లో పాల్గొననున్నారని చెప్పారు. జూన్ 1 వ తేది విశాఖపట్నంలో11వ అంతర్జాతీయ యోగా డే ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. యోగాను ప్రతి ఒక్కరు జీవితంలో ఒకభాగం చేసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. యోగాను ప్రపంచవ్యాప్తంగా యోగాకు ఆదరణ పెరుగుతోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనరి, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, బిజెపి తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జీ అజయ్ కుమార్, వైస్ ఛాన్సలర్ ఉమా, జాయింట్ కలెక్టర్ శుభం సబన్సల్, డి ఆర్ ఓ, ఆర్డీఓ, మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సహాయ కమిషనర్ అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతను భక్తి మార్గం వైపు నడిపించేలా కార్యక్రమాలను రూపొందించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : నవతరాన్ని భక్తి మార్గం వైపు నడిపించేలా, సనాతన ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం కల్పించేలా ఎస్వీబీసీలో కార్యక్రమాలు రూపొందించాలని టిటిడి ఈవో జె.శ్యామల రావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్‌లో బుధవారం ఎస్వీబీసీ అధికారులతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమల ప్రాముఖ్యత, వైష్ణవ సాంప్రదాయాలు, టిటిడి భక్తులకు అందిస్తున్న సేవలు, సనాతన ధర్మ మూలాలను పిల్లలకు తెలిపేలా కార్యక్రమాలను రూపొందించాలని ఆయన సూచించారు. కార్యక్రమాల రూపకల్పనలో నిపుణుల సలహాలను తీసుకోవాలని సూచించారు. ఎస్వీబీసీ, యూట్యూబ్, ఆన్ లైన్ రేడియో ద్వారా భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారంతో పాటు స్వామి కైంకర్యాలు, సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలను అందించాలన్నారు. ఎస్వీబీసీ ఛానల్స్ లలో హెచ్.డి క్వాలిటీతో ప్రసారం చేసేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్చువల్ గా అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి. వీరబ్రహ్మం, ఎస్వీబీసీ ఓఎస్ డి కె. పద్మావతి, ఎస్వీబీసీలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో జనసేనకు భాగస్వామ్యం కల్పించండి

చంద్రగిరి జనసేన ఇన్చార్జ్ దేవర మనోహర్ కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి) ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలలో జనసేనకు భాగస్వామ్యం కల్పించాలని చంద్రగిరి జనసేన ఇన్చార్జ్ దేవర మనోహర్ తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు బుధవారం వినతి పత్రం అందించారు.

నేడు సత్యవేడులో మినీ మహానాడు

ప్రజాశక్తి - సత్యవేడు: టీడీపీ యేటా నిర్వహించే మహానాడును పురస్కరించుకుని సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో గురువారం స్థానిక వియంకె కళ్యాణ మండపంలో 'మినీ మహానాడు' జరగనుంది. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలి రానున్న నేపథ్యంలో వారికి సకల ఏర్పాట్లను బుధవారం నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, కోఆర్డినేటర్ శ్రీపతి బాబు, ప్రవీణ్ కుమార్ రెడ్డి పర్యవేక్షించారు. తెలుగు తమ్ముళ్లు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

IN THE COURT OF ADDITIONAL SUBORDINATE JUDGE AT PONNERI
M.C.O.P NO: 54 OF 2019

Magesh Raj ...Petitioner

-VS-

1. Kamaraju Gurram
2. Bommala Veeresh
3. IFFCO TOKIO General Insurance Co. Ltd.,

...Respondents

To:-
R1) Kamaraju Gurram S/o G. Subramanyam, No.4-61, Chinnapattu, Nagalapuram, Chittoor District, Andhra Pradesh

...For 1st Respondent

PAPER PUBLICATION

Please take notice that the above M.C.O.P No. 54 / 2019 has been posted for your appearance on: 10.06.2025 before the Additional Subordinate Judge at Ponneri. Hence you are requested to appear before the Hon'ble court on: 10.06.2025 at about 10.30 A.M. failing which you will be set exparte and the case will be decided on merits.

Hg:10.06.2025

P.VENKATACHALAPATHY., M.Sc., B.L
A.MURALIDHARAN., B.a., B.L.,
A. SETU., M.A., B.L.,
Counsel for Petitioner